05-11-2022 ప్రాత:మురళి ఓంశాంతి "బాప్ దాదా" మధువనం

**"మధురమైన పిల్లలూ - మీరు గృహస్థ వ్యవహారంలో ఉంటూ అందరితో సంబంధాలను నిర్వర్తించాలి, ఒక్కసారి అనంతమైన సన్యాసం చేసి 21 జన్మల ప్రారబ్ధాన్ని తయారుచేసుకోవాలి"**

ప్రశ్న:- నడుస్తూ-తిరుగుతూ ఏ ఒక్క విషయము గుర్తున్నా కూడా మీరు ఆత్మిక యాత్రలో ఉన్నట్లు?

జవాబు:- నడుస్తూ-తిరుగుతూ ఇదే గుర్తుండాలి, మేము పాత్రధారులము, ఇప్పుడు మేము తిరిగి ఇంటికి వెళ్ళాలి. తండ్రి ఇదే స్మృతినిప్పిస్తారు, పిల్లలూ, నేను మిమ్మల్ని తిరిగి తీసుకువెళ్ళేందుకు వచ్చాను, ఈ స్మృతిలో ఉండడమే మన్మనాభవ, మధ్యాజీ భవ. ఇదే ఆత్మిక యాత్ర, దీనిని తండ్రి మీకు నేర్పిస్తారు.

ప్రశ్న:- సద్గతి యొక్క లక్షణాలు ఏమిటి?

జవాబు:- సర్వగుణ సంపన్నులు, 16 కళల సంపూర్ణులు... ఈ మహిమ ఏదైతే ఉందో ఇవే సద్గతి యొక్క లక్షణాలు, ఇవి మీకు తండ్రి ద్వారా ప్రాప్తిస్తాయి.

గీతము:- ఓర్పు వహించు మానవా... (ధీరజ్ ధర్ మనువా...)

ఓంశాంతి. ఇప్పుడు పాత నాటకము పూర్తవుతుందని పిల్లలకు నంబరువారు పురుషార్థానుసారంగా తెలుసు. దుఃఖం యొక్క రోజులు ఇంకా కొన్ని ఘడియలే ఉన్నాయి, తర్వాత సదా సుఖమే సుఖము ఉంటుంది. ఎప్పుడైతే సుఖము గురించి తెలుస్తుందో, అప్పుడు ఇది దుఃఖధామము అని అర్థమవుతుంది, రెండింటికీ చాలా తేడా ఉంది. ఇప్పుడు సుఖం కోసం మీరు పురుషార్థం చేస్తున్నారు లేదా శ్రీమతంపై నడుస్తున్నారు. ఎవరికైనా ఇది అర్థం చేయించడము చాలా సహజము. ఇప్పుడు బాబా వద్దకు వెళ్ళాలి. బాబా తీసుకువెళ్ళేందుకు వచ్చారు. గృహస్థ వ్యవహారంలో ఉంటూ కమల పుష్ప సమానంగా పవిత్రంగా ఉండాలి. సంబంధాలను తప్పకుండా నిర్వర్తించాలి. ఒకవేళ సంబంధాలను నిర్వర్తించకపోతే సన్యాసుల వలె అయినట్లు. ఎవరైతే సంబంధాలను నిర్వర్తించరో, వారిని నివృత్తిమార్గంవారని లేక హఠయోగులని అనడము జరుగుతుంది. ఇప్పుడు భగవంతుడు రాజయోగం నేర్పిస్తారు, దానిని మనం నేర్చుకుంటాము. భారత్ యొక్క ధర్మ శాస్త్రము గీత. సన్యాసులది హఠయోగము, ఇళ్ళు-వాకిళ్ళను విడిచి అడవులకి వెళ్ళిపోతారు. వారు జన్మ-జన్మలు సన్యాసం చేయవలసి ఉంటుంది. మీరు గృహస్థ వ్యవహారంలో ఉంటూ ఒకసారి సన్యాసము చేస్తారు, తిరిగి 21 జన్మలు దాని ప్రారబ్ధాన్ని పొందుతారు. వారిది హద్దు సన్యాసము, మీది అనంతమైన సన్యాసము. మీ రాజయోగానికైతే చాలా గాయనం ఉంది. భగవంతుడు రాజయోగం నేర్పించారు. భగవంతుడు అని ఉన్నతోన్నతమైనవారినే అనడం జరుగుతుంది. శ్రీకృష్ణుడు భగవంతుడు కాలేరు. అనంతమైన తండ్రి నిరాకారుడు. అనంతమైన రాజ్యాన్ని వారే ఇవ్వగలరు. ఇక్కడ గృహస్థ వ్యవహారాన్ని ద్వేషించడం జరగదు. తండ్రి అంటారు, ఈ అంతిమ జన్మ గృహస్థ వ్యవహారంలో ఉంటూ పవిత్రంగా అవ్వండి. పతిత-పావనుడు అని సన్యాసులనేమీ అనరు. వారు కూడా పావన ప్రపంచాన్ని కోరుకుంటారు. ఆ ప్రపంచం ఒక్కటే, దాని కోసం పతిత-పావనుడైన తండ్రిని పిలుస్తారు. వారు గృహస్థ వ్యవహారంలోనే లేనప్పుడు దేవతలను కూడా వారు నమ్మరు. వారెప్పుడూ రాజయోగం నేర్పించలేరు. తండ్రి ఎప్పుడు హఠయోగం నేర్పించలేరు. ఇవి అర్థం చేసుకోవలసిన విషయాలు.

ఇప్పుడు ఢిల్లీలో వరల్డ్ కాన్ఫరెన్స్ జరగనున్నది. అక్కడ ఇది అర్థం చేయించాలి, లిఖితపూర్వకంగా ఇవ్వాలి. లిఖితపూర్వకంగా ఉంటే అందరూ అర్థం చేసుకుంటారు. ఇప్పుడు మనం ఉన్నతోన్నతమైన బ్రాహ్మణ కులానికి చెందినవారము. వారు శూద్ర కులానికి చెందినవారు. మనం ఆస్తికులము. వారు నాస్తికులు. వారు ఈశ్వరుడి గురించి తెలియనివారు. మనం ఈశ్వరునితో యోగం జోడించేవారము. కావున అభిప్రాయ భేదము ఉంది కదా. తండ్రే వచ్చి ఆస్తికులుగా చేస్తారు. తండ్రికి చెందినవారిగా అవ్వడంతో తండ్రి యొక్క వారసత్వం లభిస్తుంది. ఇవి చాలా తికమక పరిచే విషయాలు. మొట్టమొదట దీనిని బుద్ధిలో కూర్చోబెట్టాలి, గీతా భగవంతుడు పరమపిత పరమాత్మ. వారే ఆది సనాతన దేవీ దేవతా ధర్మాన్ని స్థాపన చేసారు. భారత్ యొక్క దేవీ-దేవతా ధర్మమే ముఖ్యమైనది. భారతవాసులు తమ ధర్మాన్ని మరిచిపోయారు. ఇది కూడా మీకు తెలుసు, భారతవాసులు డ్రామానుసారంగా తమ ధర్మాన్ని మర్చిపోవలసిందే, అప్పుడే తండ్రి వచ్చి తిరిగి స్థాపన చేస్తారు. లేదంటే తండ్రి ఎలా వస్తారు? వారు అంటారు, ఎప్పుడెప్పుడైతే దేవీ-దేవతా ధర్మం కనుమరుగైపోతుందో, అప్పుడు నేను వస్తాను. కనుమరుగైపోవడము కూడా తప్పకుండా జరగాల్సిందే. ఎద్దు యొక్క కాలు ఒకటి విరిగిపోయింది, మిగిలిన 3 కాళ్ళపై ప్రపంచము నిలబడి ఉందని

అంటారు. ముఖ్యమైనవి నాలుగు ధర్మాలే. ఇప్పుడు దేవతా ధర్మమనే కాలు విరిగిపోయి ఉంది అనగా ఆ ధర్మం మాయమైపోయింది, అందుకే మర్రి వృక్షం యొక్క ఉదాహరణను ఇస్తారు - పునాది కుళ్ళిపోయింది, మిగిలిన కొమ్మలు-రెమ్మలపై అది నిల్చొని ఉంది. కావున ఇందులో కూడా పునాది అయిన దేవతా ధర్మం లేదు. మిగిలిన మతాలు, మార్గాలు మొదలైనవి చాలా నిలిచి ఉన్నాయి. మీ బుద్ధిలో ఇప్పుడు మొత్తం ప్రకాశం ఉంది.

తండ్రి అంటారు, పిల్లలైన మీరు ఈ డ్రామా యొక్క రహస్యాన్ని తెలుసుకున్నారు, వృక్షమంతా పాతదిగా అయిపోయింది. కలియుగం తర్వాత సత్యయుగం తప్పకుండా వస్తుంది, చక్రం తప్పకుండా తిరగాలి. ఇప్పుడు నాటకం పూర్తయింది, ఇక మనం వెళ్తున్నాము అని బుద్ధిలో ఉంచుకోవాలి. నడుస్తూ-తిరుగుతూ ఇప్పుడు మనం తిరిగి వెళ్ళాలి అని గుర్తుండాలి. మన్మనాభవ, మధ్యాజీభవ యొక్క అర్థం కూడా ఇదే. ఏదైనా పెద్ద సభలో భాషణ మొదలైనవి చేయవలసి వచ్చినప్పుడు ఇదే అర్థం చేయించాలి, పరమపిత పరమాత్మ మళ్ళీ చెప్తున్నారు - ఓ పిల్లలూ, దేహ సహితంగా దేహం యొక్క అన్ని ధర్మాలను త్యాగం చేసి స్వయాన్ని ఆత్మగా భావిస్తూ తండ్రిని స్మృతి చేయండి, అప్పుడు పాపాలు దగ్ధమవుతాయి. నేను మీకు రాజయోగం నేర్పిస్తాను. గృహస్థ వ్యవహారంలో ఉంటూ కమల పుష్ప సమానంగా అయి నన్ను స్మృతి చేయండి. పవిత్రంగా ఉండండి, జ్ఞానాన్ని కూడా ధారణ చేయండి. ఇప్పుడు అందరూ దుర్గతిలో ఉన్నారు. సత్యయుగంలో దేవతలు సద్గతిలో ఉండేవారు. బాబా వచ్చి తిరిగి సద్గతినిస్తారు. సర్వగుణ సంపన్నులు, 16 కళా సంపూర్ణులు... ఇది సద్గతి యొక్క లక్షణము. ఈ లక్షణాలను ఎవరిస్తారు? తండ్రి. మరి వారి లక్షణాలేమిటి? వారు జ్ఞాన సాగరుడు, శాంతి సాగరుడు... వారి మహిమ పూర్తిగా వేరు. అంతేకానీ, అందరూ ఒక్కరేనని కాదు. తండ్రి ఒక్కరు, ఆత్మలైన మనందరము పిల్లలము. ఇప్పుడు కొత్త రచన రచించబడుతుంది. మనమందరం ప్రజాపిత బ్రహ్మ యొక్క సంతానము. కానీ వారు ఈ విషయాలను అర్థం చేసుకోలేరు. బ్రాహ్మణ వర్ణం అన్నింటికన్నా ఉన్నతమైనది. భారత్ యొక్క వర్ణాలు గాయనం చేయబడతాయి. 84 జన్మలు తీసుకోవడంలో ఈ వర్ణాలను దాటవలసి ఉంటుంది. బ్రాహ్మణులు ఉండడమే సంగమంలో ఉంటారు.

అచ్ఛా, సైలెన్స్ అయితే చాలా మంచిది. శాంతి అనే హారమైతే కంఠంలోనే ఉంది. ఒక రాణి కథ ఉంది. ఇప్పుడు శాంతిధామమైన మన ఇల్లు చాలా గుర్తుకు వస్తుంది. శాంతి యొక్క ఇంటికి వెళ్ళాలని అందరూ కోరుకుంటారు కానీ మార్గం ఎవరు తెలియజేయాలి? శాంతి సాగరుడైన తండ్రి తప్ప ఎవ్వరూ తెలియజేయలేరు. తండ్రి మహిమ బాగుంది. వారు శాంతి సాగరుడు, ఆనంద సాగరుడు... మనుష్య సృష్టికి బీజరూపుడు, ఎంతగా రాత్రికి, పగలుకి ఉన్నంత తేడా ఉంది. కృష్ణుడిని సృష్టికి బీజరూపుడు అని అనలేరు. తండ్రి మహిమే వేరు. సర్వవ్యాపి అని అనడంతో మహిమ నిరూపించబడదు. పరమాత్మ కూర్చుని తమ పూజను చేసుకుంటారని కూడా కాదు. పరమాత్మ సదా పూజ్యులు, వారు ఎప్పుడూ పూజారిగా అవ్వరు. పై నుండి ఎవరైతే వస్తారో వారు పూజ్యుల నుండి పూజారిగా అవుతారు. పాయింట్లు అయితే చాలా ఉన్నాయి. ఇప్పుడు చూడండి, రావడమైతే ఎంతోమంది వస్తారు. కానీ కోటిలో ఏ ఒక్కరో వెలువడుతారు ఎందుకంటే గమ్యము ఉన్నతమైనది. ప్రజలైతే చాలామంది తయారవుతూ ఉంటారు. కానీ కోట్లలో ఏ ఒక్కరో మాలలో మణులుగా అవుతారు. నారదుని ఉదాహరణ ... నీవు నీ ముఖాన్ని చూసుకో లక్ష్మిని వరించేందుకు యోగ్యునిగా అయ్యావా? రాజుగా అయితే కొందరే అవుతారు. ఒక్క రాజుకు చాలామంది ప్రజలుగా అవుతారు. ఉన్నతంగా అయ్యేందుకు పురుషార్థం చేయాలి. రాజులలో కూడా కొందరు పెద్ద రాజులు, కొందరు చిన్నవారు ఉంటారు. భారత్ లో ఎంతమంది రాజులు ఉన్నారు, ఎన్ని రాజ్యాలు కొనసాగుతూ వస్తాయి. సత్యయుగంలో కూడా చాలామంది రాజులు, మహారాజులు ఉంటారు, మహారాజులకు మళ్ళీ రాకుమారులు, రాకుమార్తెలు కూడా ఉంటారు, వారి వద్ద చాలా ఆస్తి ఉంటుంది, రాజుల వద్ద తక్కువ ఆస్తి ఉంటుంది. ఇప్పుడు ప్రజలపై ప్రజల రాజ్యం ఉంది. ఇప్పుడు రాజధాని స్థాపన జరుగుతుంది. ఇది శ్రీ లక్ష్మీ-నారాయణులుగా అయ్యే జ్ఞానము. దాని కోసము మీరు పురుషార్థం చేస్తున్నారు. లక్ష్మీ-నారాయణ పదవిని పొందుతారా లేక రామ-సీతల పదవిని పొందుతారా అని అడుగుతారు. అప్పుడు అందరూ, లక్ష్మీ-నారాయణ పదవిని పొందుతాము, తండ్రి నుండి పూర్తి వారసత్వాన్ని తీసుకుంటామని అంటారు. ఇవి అద్భుతమైన విషయాలు, ఇంకెక్కడా ఈ విషయాలు ఉండవు. ఏ శాస్త్రాలలోనూ లేవు. ఇప్పుడు మీ బుద్ధి తాళం తెరుచుకుంది. తండ్రి అర్థం చేయిస్తారు, నడుస్తూ-తిరుగుతూ స్వయాన్ని పాత్రధారిగా భావించండి. ఇప్పుడు మనం తిరిగి వెళ్ళాలి, ఇది సదా గుర్తుండాలి - దీనినే మన్మనాభవ, మధ్యాజీభవ అని అంటారు. తండ్రి ఘడియ-ఘడియ స్మృతినిప్పిస్తారు, పిల్లలూ, మిమ్మల్ని తిరిగి తీసుకువెళ్ళేందుకు వచ్చాను. ఇది ఆత్మిక యాత్ర. దీనిని తండ్రి తప్ప ఇంకెవ్వరూ చేయించలేరు. భారత్ యొక్క మహిమను కూడా చేయాలి. ఈ భారత్ అతి పవిత్రమైన భూమి. సర్వుల దుఃఖహర్త, సుఖకర్త, అందరి సద్గతి దాత అయిన తండ్రి యొక్క జన్మ స్థానము. ఆ తండ్రియే అందరి ముక్తిదాత కూడా.

ఇది అన్నింటికన్నా పెద్ద తీర్థ స్థానము. భారతవాసులు శివుని మందిరంలోకి వెళ్తారు, కానీ వారికి తండ్రి గురించి తెలియదు. గాంధీ గురించి తెలుసు, వారు చాలా మంచివారని భావిస్తారు, అందుకే వెళ్ళి వారిపై పుష్పాలు అర్పిస్తారు. లక్షలు ఖర్చు చేస్తారు. ఇప్పుడు ఈ సమయంలో ఇది వారి రాజ్యము. వారు ఏం కావాలనుకుంటే అది చేయగలరు. ఇక్కడ తండ్రి కూర్చుని గుప్తంగా ధర్మ స్థాపన చేస్తారు. భారత్ లో మొదట దేవతల రాజ్యం ఉండేది. అసురులు మరియు దేవతలకు యుద్ధం జరిగినట్లుగా చూపిస్తారు. కానీ అటువంటి విషయము లేదు. ఇక్కడ యుద్ధ మైదానంలో మాయపై విజయం పొందడం జరుగుతుంది. మాయపై విజయాన్ని అయితే తప్పకుండా సర్వశక్తివంతుడైన తండ్రే ప్రాప్తింపచేస్తారు. తండ్రియే రావణ రాజ్యం నుండి విడిపించి రామ రాజ్యం యొక్క స్థాపన చేస్తున్నారు. అంతేకానీ, అక్కడ యుద్ధం మొదలైనవాటి విషయం ఉండదు. ఇప్పుడు చూడండి, మనుష్యులలో శక్తివంతులు క్రిస్టియన్లు. వారు అందరిపైనా విజయాన్ని పొందగలరు. కానీ వారు విశ్వానికి యజమానులుగా అవ్వడము అన్న నియమం లేదు. ఈ రహస్యము మీకే తెలుసు. ఈ సమయంలో సర్వశక్తివంతమైన రాజధాని క్రిస్టియన్లది. లేదంటే వారి సంఖ్య అందరికన్నా తక్కువగా ఉండాలి ఎందుకంటే వారు చివర్లో వచ్చారు, కానీ మూడు ధర్మాలలోనూ ఇది అన్నింటికన్నా శక్తివంతమైనది. అందరినీ చేతిలోకి తీసుకున్నారు. ఇది కూడా డ్రామా తయారుచేయబడి ఉంది. వీరి ద్వారానే మళ్ళీ మనకు రాజధాని లభించనున్నది. కథ కూడా ఉంది, రెండు కోతులు పోట్లాడుకుంటాయి, వెన్న మూడవదానికి లభిస్తుంది. వారు పరస్పరంలో పోట్లాడుకుంటారు - వెన్న భారతవాసులకు లభిస్తుంది. కథ అయితే సాధారణమైనది. దాని అర్థం ఎంత పెద్దది. మనుష్యులు పాత్రధారిగా ఉంటూ కూడా డ్రామా గురించి తెలియదు. ఈ జ్ఞానాన్ని అర్థం చేసుకునేది కూడా పేదవారే. షావుకార్లు ఏమీ అర్థం చేసుకోరు. పేదల పెన్నిధి, పతిత-పావనుడు తండ్రే అని అంటూ ఉంటారు. ఇప్పుడు ప్రాక్టికల్ గా పాత్రను అభినయిస్తున్నారు. పెద్ద-పెద్ద సభలలో మీరు అర్థం చేయించాలి. మెల్ల-మెల్లగా వాహ్-వాహ్ వెలువడుతుంది అని వివేకం చెప్తుంది. చివరి క్షణంలో ఢంకా మోగనున్నది. ఇప్పుడైతే పిల్లలపై గ్రహచారం కూర్చుంటూ ఉంటుంది. లైన్ స్పష్టంగా ఉండదు. విఘ్నాలు కలుగుతూ ఉంటాయి. ఎంతగా పురుషార్థం చేస్తారో, అంతగా ఉన్నతమైన ప్రారబ్ధం లభిస్తుంది. పాండవులకు 3 అడుగుల భూమి లభించేది కాదు - అది ఇప్పటి గాయనము. కానీ వారే మళ్ళీ విశ్వానికి యజమానులుగా అవుతారని ఎవ్వరికీ తెలియదు. ప్రాక్టికల్ గా పిల్లలైన మీకు ఇప్పుడు తెలుసు, ఇందులో చింతించాల్సిన అవసరం లేదు. కల్పక్రితం కూడా ఈ విధంగా జరిగింది. డ్రామా యొక్క పట్టాపై నిలబడి ఉండాలి. కదలకూడదు. ఇప్పుడు నాటకం పూర్తవుతుంది. సుఖధామంలోకి వెళ్తాము. చదువును ఎలా చదువుకోవాలి అంటే దాని ద్వారా ఉన్నత పదవిని పొందాలి. అచ్ఛా!

మధురాతి-మధురమైన సికీలధే పిల్లలకు మాత-పిత బాప్ దాదాల ప్రియస్మృతులు మరియు గుడ్ మార్నింగ్. ఆత్మిక పిల్లలకు ఆత్మిక తండ్రి నమస్తే.

ధారణ కొరకు ముఖ్య సారము:-

1. ఏ విషయము గురించి చింతించకూడదు. తమ బుద్ధి లైన్ ను సదా స్పష్టంగా ఉంచుకోవాలి. గ్రహచారం నుండి స్వయాన్ని సంభాళించుకోవాలి.

2. గృహస్థ వ్యవహారములో సంబంధాలను నిర్వర్తించాలి, ద్వేషించకూడదు. కమల పుష్ప సమానంగా ఉండాలి. ఆస్తికులుగా అయి అందరినీ ఆస్తికులుగా తయారుచేయాలి.

వరదానము:- పెద్ద మనసు పెట్టుకొని సేవ యొక్క ప్రత్యక్ష ఫలం వెలువడేలా చేసే విశ్వ కళ్యాణకారీ భవ

ఏ పిల్లలైతే పెద్ద మనసు పెట్టుకొని సేవ చేస్తారో, అప్పుడు సేవ యొక్క ప్రత్యక్ష ఫలం కూడా పెద్దగానే వెలువడుతుంది. ఏ కార్యం చేస్తున్నా కూడా స్వయము చేయడములో కూడా పెద్ద మనసు మరియు ఇతరులను సహయోగిగా చేయడంలో కూడా పెద్ద మనసు ఉండాలి. స్వయం కోసం మరియు సహచరులైన సహయోగీ ఆత్మల కోసం సంకుచిత మనసును పెట్టుకోకండి. పెద్ద మనసు పెట్టుకోవడముతో మట్టి కూడా బంగారముగా అయిపోతుంది, బలహీనముగా ఉన్న సహచరుడు కూడా శక్తిశాలిగా అయిపోతాడు, అసంభవము అనిపించే సఫలత సంభవమైపోతుంది. దీని కోసం నేను-నేను అన్నది బలి ఇవ్వండి, అప్పుడు పెద్ద మనసు కలవారిగా విశ్వ కళ్యాణకారి అయిపోతారు.

స్లోగన్:- కారణాన్ని నివారణలోకి పరివర్తన చేయడమే శుభ-చింతకులుగా అవ్వడము.

మాతేశ్వరిగారి అమూల్యమైన మహావాక్యాలు

మీరే మాకు తల్లి తండ్రి, మేము మీ పిల్లలము, మీ కృపతో అపారమైన సుఖాన్ని పొందాము...ఇప్పుడు ఈ మహిమ ఎవరి కోసం గాయనం చేయబడింది? తప్పకుండా పరమాత్మ కోసమే గాయనం ఉంది ఎందుకంటే పరమాత్మ స్వయం తల్లి-తండ్రి రూపంలో వచ్చి ఈ సృష్టికి అపారమైన సుఖాన్ని ఇస్తారు. తప్పకుండా పరమాత్మ ఎప్పుడో సుఖం యొక్క సృష్టిని తయారుచేసారు, అందుకే వారిని తల్లి-తండ్రి అని పిలుస్తారు. కానీ మనుష్యులకు సుఖమంటే ఏమిటో తెలియనే తెలియదు. ఎప్పుడైతే ఈ సృష్టిపై అపారమైన సుఖం ఉండేదో, అప్పుడు సృష్టిపై శాంతి ఉండేది, కానీ ఇప్పుడు ఆ సుఖం లేదు. ఇప్పుడు మనుష్యులకు, ఆ సుఖం మాకు కావాలి అని ఈ కోరిక తప్పకుండా ఉత్పన్నమవుతుంది, మళ్ళీ కొందరు ధనాన్ని, పదార్థాలను అడుగుతారు, కొందరు పిల్లలను అడుగుతారు, కొందరైతే ఇలా కూడా అడుగుతారు, మేము పతివ్రత నారిగా అవ్వాలి. ప్రతి ఒక్కరి కోరికైతే సుఖం గురించే ఉంటుంది కదా. కావున పరమాత్మ కూడా ఏదో ఒక సమయంలో వారి ఆశను తప్పకుండా పూర్తి చేస్తారు. కావున సత్యయుగ సమయంలో ఎప్పుడైతే సృష్టిపై స్వర్గముండేదో, అప్పుడు అక్కడ సదా సుఖం ఉంటుంది, అక్కడ స్త్రీ ఎప్పుడూ విధవగా అవ్వదు, కావున ఆ ఆశలు సత్యయుగంలో పూర్తి అవుతాయి, అక్కడ అపారమైన సుఖం ఉంటుంది. ఇకపోతే, ఈ సమయం ఉన్నదే కలియుగము. ఈ సమయంలోనైతే మనుష్యులు దుఃఖమే దుఃఖము అనుభవిస్తారు. ఇకపోతే, ఎప్పుడైతే మనుష్యులు అతి దుఃఖాన్ని అనుభవిస్తారో, అప్పుడు అంటారు, ప్రభువు ఇచ్చినది మధురమైనదని భావిస్తూ అనుభవించాలి. కానీ ఎప్పుడైతే స్వయం పరమాత్మ వచ్చి మన కర్మల ఖాతా అంతటినీ సమాప్తం చేస్తారో, అప్పుడే మనం నీవే తల్లివి తండ్రివి...అని అంటాము. అచ్చా. ఓం శాంతి.